# అమెరికా న్యూబర్గ్‌లో షిర్డీ ఆలయం-శ్రీసాయిధామం

భగవంతుడు సర్వాంతర్యామి.అందుకే బమ్మెర పోతనగారి ఆంధ్ర మహా భాగవతంలో మహా భక్తుడయిన ప్రహ్లాదుడు తండ్రితో 'ఇందుగలడందు లేదను సందేహమువలదు చక్రి సర్వోపగతుండు. ఎందెందు వెదకి చూచిన అందందే గలడు' అంటాడు. అంటే మనకి ఉన్నట్టుగా పరమాత్మకు దేశకాల పరిమితులు లేవు. ఆయన నివాసానికి ఎల్లలూ లేవు.

అందుకే కాబోలు పూర్వం భక్తజనోద్ధారణకోసం భారత పుణ్యభూమిమీద అవతరించి షిర్డీక్షేత్రంలో నడయాడి ఆపన్నుల ఆర్తి తీర్చిన భగవానుడు....సిద్ధపురుషుడు...శ్రీ సాయినాధులు... చదువుకోసం జీవనోపాధికోసం అమెరికా వలసవచ్చిన భక్తులకు తన దర్శనాన్ని సులభంగా అనుగ్రహించేందుకు కోరినవారి కొంగు బంగారంగా ఉత్తర అమెరికాఖండంలో ఇండియానా రాష్ట్రంలోని న్యూబర్గ్‌లో మళ్లీ వెలిసారు. ఇండియానాపోలిస్‌కు న్యూబర్గ్ 200 మైళ్ల దూరంలో ఉంది.

జీవనోపాధి నిర్వహణలో పనిభారంతోనో, వీసా కారణాలతోనో ఆర్థిక ఇబ్బందులతోనో షిర్డీ సందర్శించలేకపోయే భక్తులకు తాము భారతదేశంలోనే ఉన్నట్టుగా భావింపజేసే పంటచేలతో సుభిక్షమైన ఇండియానా రాష్ట్రంలోని శ్రీసాయినాధులు వెలసిన ఈ న్యూబర్గ్ శ్రీసాయిధామం అమెరికా షిర్డీధామంగా విలసిల్లుతోంది.

శ్రీసాయిని త్రికరణశుద్ధిగా నమ్మిన ముగ్గురు ధర్మకర్తలు– డాక్టర్ దుర్గాప్రసాదరావు, డాక్టర్ వెంకటేశ్వర ప్రసాద్, డాక్టర్ సుమలతలను అమెరికాలోని మూడు రాష్ట్రాల ప్రజలను సమీకరించి మూడు నెలల వ్యవధిలో మూడేళ్లక్రితం శ్రీసాయి వెలసిన ఆలయం శ్రీసాయిధామం.

12 ఎకరాల సువిశాల ప్రాంగణంలో పచ్చని ప్రకృతి మధ్య సుందరమైన వృక్షసమూహాలతో, పరిమళాలను వెదజల్లే వివిధ వర్ణాల పుష్ప సోయగాలతో, మనోల్లాసాన్ని కలిగించే 'బ్లూ లేక్' –అనే సరోవరంతో, సురభి, లక్ష్మి, సుమన అనే గోమాతలతో అక్కడ అడుగుపెట్టిన భక్తుల హృదయాలలో ఒక పవిత్ర భావనను కల్పిస్తూ ఎంతో ప్రశాంతతను చేకూరుస్తూ ఉంటుంది శ్రీసాయిధామం. చలికాలంలో గోమాతలు తీవ్రమైన చలిని తట్టుకునేందుకు వీలుగా అనుకూల వాతావరణ కల్పనతో చక్కని గోశాలల నిర్మాణం ద్వారా శ్రీసాయిధామంలో సంతృప్తికరంగా గోసంరక్షణ జరుగుతోంది.

పేరుకు తగ్గట్టుగా ఇక్కడ శ్రీమాత లలితా త్రిపురసుందరీ అమ్మవారితో శ్రీసాయి తూర్పుముఖంగా ప్రసన్నవదనంతో విలసిల్లుతూ కొలువైవుంటారు.

సాయిమందిరం ఉపరిభాగం మధ్యలో నక్షత్రం అమర్చిన అష్టదళపద్మంతో 'అల్లా ఈశ్వరుడు ఒక్కరే' అన్న సాయిబాబా వాక్కును భక్తులకు జ్ఞప్తికి తెస్తున్నట్లుగా వారి మనస్సులలో మతసామరస్యాన్ని పాదుకొల్పుతూ రంజింపచేస్తూంటుంది.

ప్రతినిత్యమూ సూర్యభగవానుడు ఆరతి సమయంలో శ్రీసాయిధామం వాకిట తన సహస్రకిరణాలతో స్వామికి పాదాభివందనం చేస్తున్న రీతిలో మేలుకొలుపులు పాడుతుంటాడు.

శ్రీసాయిధామం అధ్యక్షునిగా డాక్టర్ దుర్గాప్రసాదరావు, వారి సతీమణి లక్ష్మీతులసి అమెరికాలోని సుదూర రాష్ట్రాలనుండి శ్రీసాయిధామంలోని సాయినాధుని దర్శించుకోవాలని ఆర్తితో విచ్చేసే అసంఖ్యాక భక్తుల సేవయే పరమార్థంగా వారికి ఏలోటూ లేకుండా అన్ని సౌకర్యాల కల్పనకు విశేషంగా కృషి చేస్తుంటారు.

ప్రధాన అర్చకులు వెంకట శేషాచార్యులు అనికేపల్లి ఆధ్వర్యంలో శ్రీసాయిధామంలో ప్రతి సంవత్సరము ప్రధానంగా శ్రీరామనవమి, గురు పూర్ణిమ, విజయదశమి ఈ మూడు పండుగలూ ఘనంగా నిర్వహించబడుతుంటాయి.

గురుస్థానంలో ధూప్ నిర్వహిస్తారు.ఇక్కడ భక్తులు తూర్పు ముఖంగా కూర్చుని ధ్యానం చేస్తుంటారు. ద్వారకామాయిలో దీపపూజ,తులసీపూజ జరుగుతుంది.మందిరంలో శ్రీసాయినాధునికి నిత్యమూ నాలుగు ఆరతులు, అభిషేకం అర్చన జరుగుతాయి.లెండివన పుష్పాలతో స్వామికి నిత్య కైంకర్యం జరుగుతుంది.శ్రీసాయి చావడిలో నిత్య పూజలతోబాటు ప్రమఖ పర్వదినాలలో చావడి ఉత్సవం నిర్వహించడం జరుగుతుంది.భక్తులు నృత్యగీతాలతో భజనలతో స్వామిని సేవిస్తారు.

స్వామికి 11 వారాలు పదకొండు వత్తులతో దీపాలు వెలిగించి 11 నాణాల దక్షిణ సమర్పించి నట్లయితే కోరిన కోరికలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.భక్తులు లెండివనాన్ని దర్శించి ఔతుంబర, అశ్వత్థ, బిల్వ, వేప ఉసిరిక వృక్షాలను పూజించి ప్రదక్షిణలు చేస్తారు.ఆలయ నిర్వహణలో భాగంగా ఇక్కడకు విచ్చేసిన భక్తులకు నిత్యాన్నదానం చేస్తారు.

గోమాత అనుగ్రహం కలిగితే ముక్కోటి దేవతల అనుగ్రహం పొందినట్టేనని హైందవ సంప్రదాయంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. అమెరికాలో పుట్టిన భారతీయ బాలలకు హిందూ సంప్రదాయంలో గోవుయొక్క విశిష్టతను తెలియజేసేందుకు ఇక్కడి గోశాల తోడ్పడుతోంది. ఈ సాయిధామంలో గోసంరక్షణలో భాగంగా నిత్యమూ గోపూజలు జరుపుతారు. పర్వదినాల్లో ఆలయానికి విచ్చేసిన భక్తులు శ్రీసాయిధామంలోని లక్ష్మి, సురభి, సుమన గోమాతలను దర్శించి పూజించి నైవేద్యాలు సమర్పిస్తారు.

ఆలయంలో నిత్యమూ పార్వతీపరమేశ్వరులకు, మహాగణపతికి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు నిత్యపూజ అభిషేకాది కార్యక్రమాలు జరుగుతుంటాయి. హనుమాన్‌చాలీసా పారాయణం,పల్లకీసేవ, సాయినాధ భజన, శనిత్రయోదశి తైలాభిషేకం,కార్యక్రమాల్లో ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులు కూడా విశేషంగా పాల్గొంటూంటారు.మాస శివరాత్రి రుద్రాభిషేకం, ప్రతి పౌర్ణమి అమావాస్యలలో లలితా సహిత మేరు అభిషేకం జరుగుతుంది.రమావాణీసవ్య దక్షిణ సేవితగా శ్రీచక్రసమేతంగా శ్రీలలితా పరమేశ్వరి పద్మపీఠంలో కొలువైఉన్న అమ్మవారికి వసంత నవరాత్రులలోను, శరన్నవరాత్రుల్లోను విశేషపూజలు, చండీహోమం నిర్వహిస్తారు. శ్రీసాయిధామంలో ఇంకా శ్రీవేంకటేశ్వర స్వామి, రామపరివారం, మహాదేవుని మందిరాలు నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

www.srisaidham.org
6299 Oak Grove Rd, Newburgh, Indiana 47630
Telephone: 812.490.0021
shirdisaisansthanoftristates@gmail.com

+++